క్లుప్తంగా

జీవనోపాధి కోసం కోళ్ల పంపిణీ

పుత్తూరు: వైఎస్సార్ క్రాంతి పథం కింద మహిళల జీవనోపాధి కోసం సబ్సిడీపై కోళ్ల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ మునివేలు తెలిపారు. పుత్తూరు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం కోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెరటి కోళ్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 45 యూనిట్లకు ఒక్కో యూనిట్ కింద 11 కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా మెరుగుపడాలని సూచించారు.

19న తిరుమలయ్యపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె-1లో ఈనెల 19న శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జక్కిదొనలో నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 1,145 కుటుంబాలను సర్వే చేసి, 309 మందికి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించి, వారి ఉచితంగా వైద్య సేవలు అందించినట్లు చెప్పారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతరాయానికి మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నాగలాపురంలో..

నాగలాపురం: నాగలాపురంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ చంద్రనాయక్, ఏఈ జైసాయి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: పట్టణంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం, లక్ష్మీనగర్ వద్ద గల 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



రేణిగుంట: కేంద్రప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ విధానాన్ని అమలు చేస్తోందని, దానిని వెంటనే ఉప సంహరించుకుని పాత విధానాన్ని అమలులోకి తీసుకురావాలని రేణిగుంట రైల్వే పెన్షనర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రేణిగుంట బుగ్గవీధిలోని రైల్వే పెన్షనర్స్ యూనియన్ కార్యాలయం ఎదుట శుక్రవారం రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. కేంద్రం దిగి రాకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు హసన్‌సాహెబ్, కార్యదర్శి గుమ్మడి జయంత్‌కుమార్, కృష్ణమనాయుడు, రాజేంద్రన్, అప్పారెడ్డి, జ్ఞానశేఖర్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథాన పుత్తూరు డిపో

- కరోనా నష్టాల నుంచి కోలుకుంటున్న ఆర్టీసీ
- ఈ ఏడాది రూ.1.18 కోట్ల ఆదాయం
- పల్లెలకు మెరుగైన రవాణా సౌకర్యాలు
- విద్యార్థులకు ఉచిత పాసులు, దివ్యాంగులకు రాయితీలు



ఓరూరు పేట బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఫైల్)



పుత్తూరు ఆర్టీసీ డిపో

పుత్తూరు: నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల పల్లె ప్రాంతాలకు సైతం ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కరోనా కారణంగా ఆగిన ప్రగతి రథ చక్రాలు రెండేళ్ల తర్వాత నెమ్మదిగా కదిలాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రయాణికులకు సేవలందించడంలో ప్రథమ స్థానంలో కొనసాగిన పుత్తూరు ఆర్టీసీ డిపో కరోనా నష్టాలతో కొంత నెమ్మదించింది. రెండేళ్ల తర్వాత రోడ్డెక్కిన సర్వీసులు నష్టాలను పూడ్చుకుంటూ పరుగులు తీశాయి. డిపోకు చెందిన 72 సర్వీసులతోపాటు, అద్దెకు మరో 11 బస్సులతోపాటు మొత్తం 83 సర్వీసులు సేవలందిస్తున్నాయి. డిపో పరిధిలో పుత్తూరు, కార్వేటినగరం, వడమాలపేట, నారాయణవనం, నింద్ర, విజయపురం, నగరి మండలాలు ఉన్నాయి. చిత్తూరు, తిరుపతి నగరాలతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సైతం సర్వీసులను నడుపుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గత నవంబర్ నెల వరకు రూ.1.18 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి, తిరుపతి జిల్లాలో పుత్తూరు డిపో నాలుగో స్థానంలో నిలిచింది.

కొత్త సర్వీసులతో మెరుగైన సేవలు

పుత్తూరు ఆర్టీసీ డిపోలో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో గత ఏడాదిలో ఆరు కొత్త సర్వీసులను ఏర్పాటు చేశారు. నగరి-ఏడు గట్లు, నింద్ర-ఓరూరుపేట, పుత్తూరు-పిళ్లారిపట్టు, పుల్లూరు-దుర్గం, పుత్తూరు-వీఎస్ఎస్‌పురం, నగరి-కరకంతాపురం వంటి కొత్త సర్వీసులను నడుపుతున్నారు. మారుమూల ప్రాంతాకు సైతం బస్సులు తిరగుతుండడంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల కోసం

పదవ తరగతి వరకు విద్యార్థినులకు, ఏడవ తరగతి వరకు విద్యార్థులకు ఆయా పాఠశాలల నుంచి 50 కిలో మీటర్ల మేరకు ప్రభుత్వం ఉచిత పాసులను ఇచ్చి ప్రోత్సహిస్తోంది. దివ్యాంగులు మూడేళ్ల పాటు 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చు. వంద శాతం కంటి చూపులేని వారు సైతం 50 శాతం రాయితీతో ఒక సహాయకుడితో పాటు ప్రయాణించవచ్చు. అలాగే ప్రతి విద్యార్థి రాయితీలు కలిగిన పాసులతో ప్రయాణించే వెసులుబాటు కల్పించింది.

ఆర్టీసీ విలీనం ఓ చరిత్ర



సుదీర్ఘ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి మా ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషాన్ని నింపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదు. విలీనం చిన్న విషయం కాదని, చేయడం అసాధ్యమంటూ చెప్పుకొచ్చారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. ఇది చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

-ఎస్.ప్రతాప్‌కుమార్, కార్యదర్శి, ఎంప్లాయీస్ యూనియన్, పుత్తూరు

మెరుగైన సేవలే లక్ష్యం



ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సేవలు మెరుగ్గా ఉంటే లాభాలు వాటంతట అవే వస్తాయి. డిపోలో డ్రైవర్లు 172 మంది, కండక్టర్లు 182 మంది, ఇంతర సిబ్బందితో కలిపి మొత్తం 455 మంది సేవలందిస్తున్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం12 డిపోలలో పుత్తూరు డిపో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో మూడవ స్థానంలోకి వస్తామన్న నమ్మకం ఉంది.

-ఎం.ఎస్.ప్రశాంతి, ఆర్టీసీ డిపో మేనేజర్, పుత్తూరు

వైఎస్సార్ సీపీ పాలనలో ఆలయాల అభివృద్ధి

- రూ.కోట్లతో పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధి అంటే ఏమిటో గత పాలకులకు దిమ్మదిరిగేలా చేతల్లో చూపుతోంది. నియోజకవర్గంలోని శతాబ్దాల కాలం నాటి పురాతన ఆలయాలకు కోట్లాది రూపాయలు వెచ్చిం జీర్ణోద్ధరణ చేసిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గంలోని ఆరు మండలాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో టీటీడీ, దేవదాయశాఖలు కోట్లాది నిధులు మంజురు చేయడంతో వాటికి పూర్వవైభవం ప్రాప్తించింది. ఇప్పటికే మండలంలోని ఆళత్తూరులో 4 శతాబ్దాల క్రితం శాళువ రాజ వంశస్థులు నిర్మించిన వరద వెంకటేశ్వరస్వామి ఆలయం, పెనుమూరు మండలంలో కనిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయాలను టీటీడీలో విలీనం చేసిన ఘనత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిదే. అలాగే కార్వేటినగరం మండలంలోని కొటార్వేడులో వందల సంవత్సరాల క్రితం నిర్మించిన అగస్తీశ్వరస్వామి ఆలయానికి రూ.2.75 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ సైతం ఆయన మంజూరు చేయించారు. ఇక, పాలసముద్రం మండలం మఠవలంలోని పురాతన గోవర్ధనేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి, శ్రీరంగరాజపురం మండలంలో ఆరిమాకులపల్లెలోని శ్రీఆరిమానిగంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి కూడా పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేశారు. అదే విధంగా తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూ.10 లక్షల చొప్పున 87 ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడమే కాకుండా పనులు చేయిస్తున్నారు.

కంటి చూపునకు మంత్రి భరోసా



ఆపరేషన్ చేసుకున్న వారికి సూచనలిస్తున్న వైద్యసిబ్బంది



శంకరనేత్రాలయ ప్రతినిధిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ

నగరి: కంటి సమస్యలు ఉన్నవారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా శంకర నేత్రాలయ సహకారంతో 8 రోజుల పాటు నగరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ శిబిరానికి 8 రోజుల్లో 720 మంది చికిత్స నిమిత్తం విచ్చేశారు. 93 రకాల కంటికి సంబంధిత వ్యాధులను పరిశీలించిన వైద్యులు వీరిలో 137 మందికి స్థానికంగానే నొప్పి లేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసి రెండు గంటల వ్యవధిలో వారిని ఇంటికి పంపించేశారు. పెద్ద ఎత్తున కంటి సమస్యలు ఉన్నవారు 200 మందిని వివిధ కంటి చికిత్సల నిమిత్తం శంకరనేత్రాలయ బేస్ సెంటర్‌కు తరలించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని నగరి చరిత్రలో ఇలాంటి కంటి వైద్య శిబిరం నిర్వహించిన నాయకులు ఎవరూ లేదన్నారు. అలాంటి మంచి మనసున్న వ్యక్తికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని చెప్పారు. ఆపరేషన్ చేసుకున్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది క్షుణ్ణంగా వివరించారు. కంటిలో వేసుకునే మందులు, కంటిలో నీరు వస్తే తుడవడానికి వాడే నాప్కిన్స్, ప్రతి రోజు వేసుకోవాల్సిన మందులకు సంబంధిత కిట్‌ను అందించారు. అందరికీ వైద్య సిబ్బంది ఫోన్ నెంబర్లను అందించి ఏవైనా సందేహాలున్నా, సమస్యలున్నా ఎప్పుడు ఫోన్‌చేసినా వివరాలు చెబుతామని సూచించారు. తప్పనిసరిగా తాము చెప్పిన నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. అందరికీ మంత్రి నివాసం వద్దే భోజనం అందజేశారు. ఎనిమిది రోజులపాటు సేవలు అందించిన శంకర్‌నేత్రాలయ ప్రతినిధి అరుణ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, కౌన్సిలర్ బీడీ భాస్కర్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ యేసు, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నింద్ర: ప్రతి పేదవానికి ఆరోగ్యాన్ని రక్షించడమే ప్రభుత్వ ఆకాంక్ష అని ఎంపీపీ దీప అన్నారు. మండలంలోని ఎలకాటూరు సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎంపీపీ మట్లాడుతూ పేదలకు ఆరోగ్య రక్షణ కోసం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు చేసినట్లు అన్నారు. రెండో దశలో ప్రతి గ్రామంలో ప్రజలకు ఆరోగ్యవంతంగా వుండడానికి ప్రత్యేక సూచనలు, వైద్య పరీక్షలు చేశారు. వైద్యసేవలు అందించడంతోపాటు వారికి మందులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభా, వైద్యాధికారి సుమలత, శ్రావని, ప్రవీణ, గోపి, సర్పంచ్ చంద్రబాబురెడ్డి, మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్, నాయకులు వీరయ్య, దినకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పెరటి కోళ్లు పంపిణీ



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: పెరటికోళ్ల పెంపకంతో కుటుంబానికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉండవచ్చని ఎంపీపీ లత అన్నారు.శుక్రవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆలయ సన్నిధి వీధిలో ఏపీఎం విజయ కుమార్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు రాయితీపై పెరటి కోళ్లను పంపిణీ చేసి ఎంపీపీ మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఏపీఎం మాట్లాడుతూ, 50 మహిళా సంఘాలకు 50 యూనిట్ల పెరటికోళ్లు మంజూరైనట్టు చెప్పారు. ప్రతి యూనిట్ ధర రూ.3వేలని, కోళ్ల పెంపకంపై ఆసక్తి కలిగిన మహిళా సంఘాలు వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి, సర్పంచ్ ధనంజయవర్మ, మహిళా సంఘాలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

జ్యోతిలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న జ్యోతిలక్ష్మి

పుత్తూరు: వడమాలపేట మండలం ఎస్వీ పురం గ్రామానికి చెందిన నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మికి ఉత్తమ సంఘ సేవకురాలిగా పురస్కారం లభించింది. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ తులసి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఆమెకు ఈ పురస్కారం దక్కింది. రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘ సభ్యులు నాదముని, శ్రీనివాసులు, మురళి, చిట్టెమ్మ తదితరులు జ్యోతిలక్ష్మిని అభినందించారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి పునర్జన్మ

శ్రీకాళహస్తి: ఒకరి రక్తదానంతో ముగ్గరికి ప్రాణదానం చేయవచ్చని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి మున్సిపాలిటీ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, యువతరం సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద నిరాశ్రయుల వసతి గృహంలో శుక్ర వారం రక్తదాన శిబిరం నిర్వహించారు ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన కూడా రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లి దండ్రులు జన్మనిస్తే ..రక్తదానం పునర్జన్మనిస్తుందని తెలిపారు. సుమారు వందం మంది రక్తదానం చేశారు. మెప్మా సీఎంఎం ప్రసాద్, ఎన్టీఆర్ రక్తదాన ట్రస్టు వైద్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో బహుళ ప్రయోజనాలు

రేణిగుంట: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేల సారవంతంగా మారి ఆరోగ్యకరమైన పంటల దిగుబడి వస్తుందని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలి కేవీకేలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై పట్టు రైతులకు శిక్షణ ఇచ్చారు. చీడ, పీడల నివారణకు వివిధ కషాయాలను వినియోగించడం ద్వారా నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేయవచ్చన్నారు. అనంతరం కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ సహాయంతో మల్బరీ తోటల్లో మందుల పిచికారీని ప్రయోగాత్మకంగా చూపారు.

ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం

సత్యవేడు: ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని ఏఓ మురళి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కె.శ్యాప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ కార్యాయలంలో మండల రైతుల సమావేశం జరిగింది. ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతంగా మారుతుందన్నారు.

వరసిద్ధునికి రూ.3లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి విశాఖపట్నంకు చెందిన వెంకట సత్యనారాయణ రూ.3లక్షలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఉదయం దాత కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష, స్వామివారి నిత్యఅన్న దానానికి రూ.లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష కలిపి మొత్తం రూ.3లక్షలు అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు





పాలసముద్రం: కబడ్డీ క్రీడాకారులతో నిర్వాహకులు, అధికారులు, కార్వేటినగరం: విజేతలను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గంగాధర నెల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడాపోటీలు మూడవ రోజు శుక్రవారం హోరా హోరీగా జరిగాయి. మహిళల విభాగంలో ఖో-ఖో పురుషుల విభాగంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు హోరాహోరీగా సాగాయి. వీక్షకులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ముక్కలత్తూరు ఎంపీటీసీ మగిమైదాస్, పీఈటీ సెల్వ పాండియన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు అభినందన

కార్వేటినగరం: ఎంపీపీ లత అన్నారు.స్థానిక ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆడుదాం..ఆంధ్రామండల స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లను శుక్రవారం ఎంపీపీ లత అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి, సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓ పీఎస్ మణి, సచివాలయ సిబ్బంది రోజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్, పాలసముద్రం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహిళలకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏఓ విద్యావతి, విస్తరణాధికారి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్, అయ్యప్ప, ఉప సర్పంచ్ సుమన్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. 13 గ్రామ సచివాలయాల పరిధి లోంచి 524మంది పురుషులు, 319 మహిళా క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ చెప్పారు. పురుషుల విభాగం కబడ్డీ పోటీల్లో బ్రాహ్మణపల్లె జట్టు, బ్యాడ్మింటన్‌లో పచ్చికాపల్లం, వాలీబాల్‌లో దేవరగుడిపల్లె, మహిళల విభాగం కబడ్డీ పోటీల్లో తిరుమలయ్యపల్లె, బ్యాడ్మింటన్‌లో బ్రాహ్మణపల్లె, ఖో-ఖోలో దేవరగుడిపల్లె జట్లు విజేతలుగా నిలిచాయి. క్రికెట్‌లో జక్కిదొన జట్టు విజయం సాధించినట్లు జట్టు మేనేజర్ గోవిందరెడ్డి తెలిపారు.





పాలసముద్రం: నియోజకవర్గ వాలీబాల్ పోటీలకు ఎంపికైన మహిళలు, వెదురుకుప్పం: క్రికెట్‌లో విజయం సాధించిన జక్కిదొన జట్టు

మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి

బంగారుపాళెం: మత్స్యకారులు చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండలంలోని గుంతూరు సమీపంలో ఉన్న వెంకటప్పనాయుని చెరువులో శుక్రవారం ఎఫ్‌డీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏపీ మత్స్యసంస్థచే 40వేల చేపపిల్లలు, పీఎం సమృద్ధి మత్స్య సంస్థ ద్వారా 6,500 చేప పిల్లలను వదిలిపెట్టారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు కృషి చేస్తోందని చెప్పారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరీ, గంగపుత్ర సహకార సంఘ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజ, ఉమాపతి, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, సభ్యులు కేశవులు, చంద్రశేఖర్, రఘు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి, నచ్చనేరి, రాజులపాలెం ఎస్టీ కాలనీల్లో శుక్రవారం ప్రజా సాధికారిక సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మొత్తం 153 కుటుంబాలకు సరుకులు అందజేశారు. సర్పంచ్ మునిరామయ్య, వైస్సార్ సీపీ మండల నాయకుడు పత్రా సిద్దయ్య, సమితి కార్యదర్శి దేవేంద్ర, ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఆడుదాం ఆంధ్రా



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

నింద్ర: మండల స్థాయిలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించారు. అన్ని రకాల క్రీడల్లో క్రికెట్, ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగాయి. అన్ని కేటగిరీల్లో 20 జట్లకు చెందిన క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. ఇందులో గెలుపొందిన వారు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సతీష్ కుమార్, ఎంపీడీవో అరుణ, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, వైస్ ఎంపీపీ శుభా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.